వార్త

బుధవారం 22 జూలై 2026

I

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## తాతయ్యగుంట గంగమ్మకు బంగారు ముక్కుపుడక విరాళం



తిరుపతి, జులై 21ప్రభాతవార్త: తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మకు భక్తకుటుంబం బంగారు ముక్కుపుడక విరాళంగా అందించారు. మంగళవారం ఉదయం ఏర్పేడు మండలం చిన్న అంజిమేడుకు చెందిన కన్నాలె మోహన్ రెడ్డి సుమారు నాలుగు గ్రాముల రాళ్ళతో కూడిన బంగారు ముక్కుపుడకను అమ్మవారికి కానుకగా అందజేశారు. ఈ విరాళాలన్ని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఈఓ ఎ. జయకుమార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబం, పాలకమండలి సభ్యులు ఉన్నారు.

## కొండెక్కిన కోడి మాంసం ధరలు

కుప్పం, జూలై 21 ప్రభాతవార్త



కోడిమాంసం ధరలు కొండెక్కాయి. ఆదివారం కిలో కోడిమాంసం నాణ్యతను బట్టి రూ 280నుంచి 300ల దాకా పలికింది. దీంతో జనం ఇవేం ధరలు బాబోయ్ అంటూ నిట్టూర్చుతున్నారు. గతకొంతకాలంగా కోడిమాంసం(చికెన్) ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పదిహేను రోజుల క్రితం కిలో 240-250రూ.లు పలికింది. పదిహేను రోజుల్లోపే ధర పైపైకి ఎగబాకుతుండడం గమనార్హం. సాధారణంగా ఆషాఢమాసం(ఆడిమాసం) ప్రారంభం అయితే మాంసం విక్రయాలు తగ్గుతాయి. చాలామంది ఈ నెలలో మాసం జోలికివెళ్లరు.దీంతో మాంసం ధరలు తగ్గడం పరిపాటి. అయితే ఈసారి ఆషాఢమాసం మొదలైనా మాంసం ధరలు మాత్రం తగ్గక పైకి ఎగబాకుతుండడం గమనార్హం. ఇక జిహ్వారుచికి అలవాటుపడిన మాంసం ప్రియులు ధర ఎక్కువైనా కోడిమాంసం కొనుగోళ్లకు ఉత్సాహం చూపుతున్నారు.

# ఎస్‌వీయూలో మంటలు

**షార్ట్ సర్క్యూట్‌తో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయం దగ్ధం.. భయంతో విద్యార్థులు, ఉద్యోగులు పరుగులు**

**భద్రతా లోపాలపై తీవ్ర ఆగ్రహం.. విచారణకు ఆదేశించిన వర్సిటీ అధికారులు**






తిరుపతి విద్య, జులై 21 ప్రభాత వార్త

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉదయం చోటుచేసుకున్న అగ్నిప్రమాదం తీవ్ర కలకలం రేపింది. వర్సిటీలోని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద తీవ్రత పెరిగి ఉంటే భారీ నష్టం సంభవించే అవకాశం ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.మంటలు వ్యాపించడంతో కళాశాలలోని విద్యార్థులు, సిబ్బంది ఏం జరుగుతుందో అర్థంకాక బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ప్రిన్సిపల్ కార్యాలయంలోని ఫ్రిజ్, టేబుళ్లు, కిటికీ అద్దాలు, ఇతర విలువైన సామగ్రి పూర్తిగా కాలిపోయింది. నష్టం విలువ సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

**నిర్వహణ లోపాలే ప్రమాదానికి కారణమా..?**

ఫార్మసీ కళాశాల విద్యుత్ వ్యవస్థ నిర్వహణపై ప్రస్తుతం అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాతబడిన వైరింగ్, నిర్వహణ లోపాలు, భద్రతా ప్రమాణాల నిరక్ష   ్యమ్లే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భవనంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వ్యవస్థ నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**వర్సిటీ అధికారుల ఆరా...విచారణకు ఆదేశం**

ఫార్మసీ కళాశాలలో అగ్నిప్రమాద ఘటన విషయం తెలుసుకున్న ఎస్‌వీయూ వీసీ ఆచార్య నర్సింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేశారు.ప్రమాదానికి అసలు కారణాలను వెలికితీసేందుకు ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి పూర్తి స్థాయి నివేదిక కోరనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

**విద్యార్థి సంఘాల ఆగ్రహం...**

ఘటనపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. వర్సిటీలో విద్యుత్ భద్రతా ప్రమాణాలు ప్రశ్నార్థకంగా మారాయని మండిపడ్డాయి. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు నిరక్ష   ్యం వహిస్తే తీవ్ర స్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించాయి.ఫార్మసీ కళాశాల అగ్నిప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీలోని అన్ని కళాశాలలు, హాస్టళ్లు, ప్రయోగశాలల్లో తక్షణమే విద్యుత్ భద్రతా తనిఖీలు నిర్వహించాలని, పాత వైరింగ్ వ్యవస్థను మార్చాలని కోరారు.ఘటన స్థలాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎస్‌వీయూ అధ్యక్షుడు మన్నం ప్రేమ్ కుమార్, మాజీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు రాపూరి ప్రసాద్, సీఐటీయూ నగర కార్యదర్శి మాధవ్, ఎన్ఎల్ఎస్‌ఏ నేత సుందర్ రాజు , జీఎన్ఎస్ నేత శివశంకర్ నాయక్, ఎన్ఎఫ్ఎస్ఐ

### పూర్తి నివేదిక అనంతరం కారణాలు వెల్లడిస్తాం: రిజిస్ట్రార్ భూపతి నాయుడు



షార్ట్ సర్క్యూట్ ఘటనపై విచారణ చేపట్టినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు తెలిపారు. విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా మంటలు చెలరేగాయని, వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక దళానికి సమాచారం అందించడంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు.ఈ ఘటనలో ఫ్రిజ్, ఏసీ, జెరాక్స్ మిషన్ తదితర పరికరాలు దెబ్బతిన్నాయని, అయితే ఉద్యోగులు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని రిజిస్ట్రార్ తెలిపారు. ఘటన విషయం తెలిసిన వెంటనే తాను స్వయంగా కళాశాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించామని, విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించామని వెల్లడించారు.ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు స్పందించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్, ఇద్దరు లైన్‌మెన్లు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ వ్యవస్థను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే బుధవారం ఉదయం డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ బృందం కూడా కళాశాలను సందర్శించి తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

## పక్కాగా కుష్ఠ వ్యాధి నిర్మూలన

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి**



నోడల్ పర్సన్లతో సమీక్షిస్తున్న డిఎంహెచ్ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి

చిత్తూరు, జులై 21 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయిలో పక్కాగా కుష్ఠ వ్యాధి నిర్మూలన కార్యక్రమంను చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం కుష్ఠ వ్యాధి నిర్మూలన కార్యక్రమం అమలుపై పిహెచ్‌సి నోడల్ పర్సన్లతో డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అనుమానిత కుష్ఠ వ్యాధి కేసులను ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించాలని, కుష్ఠ వ్యాధిని కట్టడి చేయడానికి క్షేత్ర స్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదనపు డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడుతూ కుష్ఠ వ్యాధి కార్యక్రమంకు సంబంధించిన అన్ని రిజిస్టర్లు, ట్రీట్‌మెంట్ కార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి రోగి వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసి, చికిత్స పురోగతి, వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. అలాగే ఎంసిఆర్ ఫుట్‌వేర్ అవసరమైన రోగుల కోసం సంబంధిత పిహెచ్‌సిలు అవసరమైన ఇండెంట్‌ను పంపిస్తే జిల్లా కార్యాలయం ద్వారా త్వరితంగా సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కుష్ఠ వ్యాధి కట్టడి కోసం ప్రతి పిహెచ్‌సి నోడల్ పర్సన్ చురుకుగా పని చేసి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో టిహెచ్ వార్డు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జానకిరావు, డిఎన్ఎంఓ డాక్టర్ సాయి షర్మిల, ఫిజియోథెరపిస్టు జాన్, జిల్లా పారా మెడికల్ ఆఫీసర్లు, జిల్లా కుష్ఠ వ్యాధి కార్యక్రమ సిబ్బంది, జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కుష్ఠ వ్యాధి ఇన్‌చార్జీలు, నోడల్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సిపిఆర్‌పై అవగాహన

తిరుపతి, జులై 21ప్రభాతవార్త:



ప్రమాదాలు, గుండె పోటు, శ్వాస ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సమయానికి సిపిఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వైద్యులు తెలిపారు. ఐఎపి సిపిఆర్ దినోత్సవం సందర్భంగా పోలీసు సిబ్బందికి మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో సిపిఆర్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏదేని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే ఈ విధానంపై వైద్య నిపుణులు ప్రయోగాత్మకంగా పోలీసు సిబ్బందికి శిక్షణనిచ్చారు.తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సిపిఆర్ దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి కార్డియో పల్మనరీ రీససిటేషన్ పై ప్రత్యేక అవగాహన చేపట్టారు. ఈ కార్యక్రమానికి రూయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మనోహర్, డిప్యూటీ సూపరింటెండెంట్ (చిన్నపిల్లల) ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధూర, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యోగేష్, పోలీస్ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.వి. నాగ దుర్గాదేవి వైద్య విద్యార్థులు పాల్గొని సిపిఆర్ నిర్వహించే సరైన విధానం, ఛాతిపై ఒత్తిడి , కృత్రిమ శ్వాస , అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలీసు విధుల్లో రోడ్డు ప్రమాదాలు, ప్రజా సమూహాలు, అత్యవసర సంఘటనలు తరచుగా ఎదురవుతుంటాయని, అటువంటి సందర్భాల్లో సిపిఆర్‌పై అవగాహన, నైపుణ్యం ఉంటే ప్రాణాలను రక్షించడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తారని వైద్య నిపుణులు తెలిపారు. ప్రతి పోలీసు సిబ్బంది ఈ ప్రాణరక్షక నైపుణ్యాన్ని అలవరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాసులు ,పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్**

తిరుపతి కలెక్టరేట్, జూలై 21 ప్రభాతవార్త :

రైల్వే ప్రాజెక్ట్,భూసేకరణ, జాతీయ రహదారులు పనులు శ్రీ సిటీ ఫేస్ 2, ఎల్ జి ఫేస్2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫీల్డ్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీ క్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు , శ్రీ సిటీ ఫేస్ 2, ఎల్ జి ఫేస్2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలకు సంబంధించి తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

**తిరుపతి జిల్లా రాజకీయాలపై**

## వైఎస్‌ఆర్సిపి సమీక్ష



తిరుపతి రూరల్, జూలై 21 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలపై కీలక సమీక్షా సమావేశం విజయవాడలో జరిగింది. పార్టీ ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ కార్యాచరణపై నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్ఆర్సిపి బీసీ సెల్ అధ్యక్షుడు వై. సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం, మాజీ మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, రమేష్‌యాదవ్‌లతో కలిసి జిల్లా రాజకీయ పరిస్థితులపై విస్తృతంగా చర్చ జరిగింది. దాదాపు 45 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో జిల్లాలో పార్టీ కేడర్ పరిస్థితి, నాయకుల వైఖరి, పార్టీపై ప్రజల అభిప్రాయం వంటి కీలక అంశాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలు ఎలా సాగుతున్నాయి, స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ బలోపేతానికి ఎంతవరకు కృషి చేస్తున్నారు అనే అంశాలపై లోతైన సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వైఎస్ఆర్సిపి బలహీనతలు, బలాలు ఏమిటి అనే దానిపై కూడా నేతలు విశ్లేషణ చేపట్టారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యంగా కేడర్‌ను చైతన్యపరిచే దిశగా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరాన్ని నేతలు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ పునర్వ్యవస్థీకరణ, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకత్వాన్ని సమన్వయం చేయాల్సిన అవసరంపై కూడా చర్చ జరిగినట్లు పార్టీవర్గాలు పేర్కొన్నాయి. కొత్త దిశా నిర్దేశం లభించేఅవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## శభాష్ పోలీస్...

**చంద్రగిరి హెడ్ కానిస్టేబుల్‌కు సర్వత్రా సెల్యూట్**

**మహిళ ప్రాణాలను కాపాడటంలో సాహసం**





చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త:

శభాష్ పోలీస్ అంటూ చంద్రగిరి హెడ్ కానిస్టేబుల్ చలపతికి సర్వత్రా గౌరవ ప్రదమైన సెల్యూట్ లభిస్తున్నది. వివరాలను పరిశీలిస్తే.. శ్రీనివాస మంగాపురంలో మంగళవారం ఓ మహిళ బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు డయల్ 112 సమాచారం రావడంతో ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాల మేరకు.. తిరుపతి జిల్లా పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది చంద్రగిరి పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో చంద్రగిరి ఇన్‌చార్జ్ సిఐ టి.వి.సత్యనారాయణ హుటాహుటిన ఎస్ఐ అరుణాచలం, హెడ్ కానిస్టేబుల్ కె.చలపతి, సిబ్బందిని సంఘటనా స్థలికి పంపించారు. మండల పరిధిలోని రాయలపురంకు చెందిన ఓ వివాహిత (21) తన భర్తతో విడిపోయి శ్రీనివాస మంగాపురంలోని తన అక్క ఇంట్లో వుంటున్నది. ఈ క్రమంలో తిరుపతి జీవకోనకు చెందిన మరొకరితో పరిచయం ఏర్పడింది. దీంతో తనను వివాహం చేసుకోవాలని అతనిపై వత్తిడి తేవడంతో అతను తన నివాసంలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఇది తెలుసుకున్న ఆమె తమ్ముడు అక్కను మందలించాడు. దీంతో కలత చెందిన వివాహిత బావిలోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించడంతో సమయానుకూలంగా స్పందించిన చంద్రగిరి పోలీసులు బాధిత మహిళను సంరక్షించగలిగారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని గమనించిన చలపతి మహిళను కాపాడటం కోసం తనకు ప్రమాదం జరిగే అవకాశం వున్నా అవేమీ పట్టించుకోకుండా ఒక్క ఉదుటున బావిలోకి దూకి మహిళను నీట మునిగిపోకుండా కాపాడి గట్టుకు చేర్చారు. మహిళకు ప్రాథమిక వైద్య చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తరలించారు. ప్రజల ప్రాణ రక్షణలో పోలీసులు ఎల్లప్పుడు కర్తవ్య నిర్వహణకు కట్టుబడివున్నారని ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. ఎవరికైనా కష్టం కలిగితే ఆత్మహత్య ఒక్కటే మార్గం కాదని, క్షణికావేశంలో ఇటువంటి నిర్ణయాలు మంచివి కావని హితవు పలికారు. ఇటువంటి సమస్యలు ఎదురైనప్పుడు స్నేహితులు, కుటుంబ సభ్యులు, అధికారుల సహకారంతో ఒత్తిడిని అధిగమించడానికి ప్రయత్నించాలే తప్ప ఆత్మహత్య ఒక్కటే మార్గం కాదని అన్నారు. చలపతి ధైర్య సాహసాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# మంత్రి హామి ఇచ్చినా ఆలస్యమేనా?

**లీజు అగ్రిమెంటు ఖర్చులు ఎవరు చెల్లించాలనే సందిగ్దం**

**అభివృద్ధికి అనంత జేయన్‌టియు రూ.20కోట్లు మంజూరు**

**కౌన్సెలింగ్ జరుగుతున్నా: ప్రభుత్వ స్పందన ఆలస్యం**

(శ్రీకాళహస్తి - ప్రభాతవార్త)

రాజకీయ నాయకులు వేదికల మీద ప్రకటించినంత వేగంగా ప్రభుత్వంలో ఫైళ్ళు కదలటం లేదనే అసంతృప్తి జనాల్లో చోటు చేసుకుంది. శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు పునరుజ్జీవనం కోసం రాష్ట్ర విద్యాశాఖ ఆర్థిక సహాయం చేయటానికి కూడా అనుమతించింది. నిధులను ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. కానీ ఆచరణలో ఎందుకో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఈ ఇంజనీరింగ్ కళాశాలను అనంతజేయన్‌టియుకు అనుబంధం చేసారు. ఏడాదిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు మారింది. ఇక్కడి కళాశాలకు కోట్లు రూపాయల విలువ చేసే 50 ఎకరాల స్థలం ఉంది.అయితే మొదట స్థలం అంతా లీజుకు తీసుకున్నట్లు అగ్రిమెంట్ చేయాలని కోరారు. అది సాధ్యం కాదని ఇందులో కొంత ఇతర సంస్థలకు అప్పగించినట్లు చెప్పటంతో ఇచ్చేంత 'రిజిస్ట్రేషన్' చేయాలని తరువాతే ఇక్కడ తాము ఏం చేయాలన్నది నిర్ణయిస్తామన్న జేయన్‌టియు నిర్ణయంతో లీజు అగ్రిమెంట్ చేయాలంటే స్టాంప్ డ్యూటి రూ.3కోట్లు కావాలని ఈ ఖర్చులను ఎవరు భరించాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఈ సమస్యను ఉన్నత విద్యాశాఖామాత్యులు నారాలోకేష్ దృష్టికి తెచ్చారు. ఆయన ప్రభుత్వం నుంచి అనుమతి ఇస్తామని భరోసా ఇచ్చారు.కానీ ఈ సమస్య మంత్రివర్గ సమావేశంలో ఆమోదించాల్సి ఉంది. కానీ గత మంత్రి వర్గ సమావేశంలో మంత్రి లేనందువల్ల వీలు కాలేదు. మరి కౌన్సెలింగ్ సమయం ఆసన్నమైంది.ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో విద్యార్థులు చారాలా? వద్దా? అనే సందిగ్దంలో ఉన్నారు.ప్రభుత్వం పుష్కలంగా నిధులు మంజూరు చేసినపుడు ఎందుకు అనుమతిలివ్వటంలో జాప్యం అనేది చర్చనీయాంశంగా మారింది.

**అనంతజేయన్‌టియు రూ.20కోట్లు కేటాయింపు:**

శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను అనంతజేయన్‌టియులో విలీనం చేయటంతో జేయన్‌టియు అభివృద్ధి పనులకు రూ.20కోట్లు కేటాయించారు.ఇందులో ప్రయోగశాలల అభివృద్ధికి రూ.11కోట్లు, భవనాల మరమ్మత్తులకు రూ.9.7కోట్లు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచారు.అయితే దేవస్థానం లీజు అగ్రిమెంట్ చేయనిదే అనంత జేయన్‌టియు ముందడుగు వేయలేందు. కారణం నిబంధనలు. అగ్రిమెంట్‌కు సంబంధించి రూ.3.2కోట్లు ప్రభుత్వమే భరిస్తుందని ఉన్నత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ భరోసా ఇచ్చారు.కాబట్టి ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో విద్యార్థులు చేరవచ్చు.



**అగ్రిమెంట్ జరిగితే స్కిట్‌లోనే తరగతులు: వైస్‌చాన్సలర్**

శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను గత ఏడాది స్వాధీనం చేసుకున్న అనంత జేయన్‌టియు ఆడ్మిషన్లు చేసారు. గత ఏడాది చేరిన 38 మంది విద్యార్థులు కలికిరిలో చదవాల్సి వచ్చింది.అయితే ఈ ఏడాది శ్రీకాళహస్తిలోనే తరగతులు నిర్వహించక తప్పదని వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు.లీజు అగ్రిమెంట్ పూర్తి అయితే తాముయుద్ధ ప్రాతిపదికపై పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ సారి శ్రీకాళహస్తిలోనే చేరిన విద్యార్థులకు తరగతులు నిర్వహించక తప్పదని వివరణ ఇచ్చారు.ఇతర ప్రాంతాల్లో అవకాశం కూడా లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# సత్వరం ఎస్టీ కాలనీల్లో మౌళిక సదుపాయాలు



**- పెనుమూరు, గుడిపాల, చిత్తూరు రూరల్ మండలాల్లోని ఎస్టీ కాలనీల్లో జడ్పీ సిఇఓ అకస్మిక తనిఖీ**

**చిత్తూరు, జులై 21 ప్రభాతవార్త:**
ఎస్టీ కాలనీల్లో నివాసం వుంటున్న వారికి మౌళిక సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని జడ్పీ సిఇఓ వి.రవికుమార్‌నాయుడు అన్నారు. జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు మంగళవారం పెనుమూరు మండలంలోన శేషాపురం ఎస్టీ కాలనీ, గుడిపాల మండలంలోని కనకనేరి ఎస్టీ కాలనీ, చిత్తూరు రూరల్ మండల పరిధిలోని జర్రిమడుగు ఎస్టీ కాలనీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు పెనుమూరు మండలంలోని శేషాపురం ఎస్టీ కాలనీలో మంచినీటి సరఫరా పరిస్థితిని పరిశీలించి సకాలంలో మంచినీటి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇటీవల ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పనులను జడ్పీ సిఇఓ పరిశీలించి తాగునీటి సరఫరా కోసం డ్రిల్ చేసిన బోర్‌వెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించడానికి జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను జడ్పీ సిఇఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంట బీమా నమోదు ప్రక్రియ ప్రారంభం

**యాదమరి, జులై 21 ప్రభాతవార్త:**
ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పిఎంఎఫ్‌బివై), ఆర్‌డబ్ల్యుబిసిఎస్ఎస్ కింద 2026-27 సంవత్సరానికి పంటల బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైందని మండల వ్యవసాయ అధికారి దీప తెలిపారు. నోటిఫై చేయబడిన ప్రాంతాల్లో నోటిఫై చేసిన పంటలను సాగు చేస్తున్న రైతులందరు పంటల బీమాకు అర్హులని, రైతులందరు పంటల బీమాను స్వచ్ఛందంగా నమోదు చేసుకోవాలన్నారు. వరి పంటకు ప్రీమియం ఎకరాకు రూ.840, ఈ మొత్తంను ఆగస్టు 15లోపు, రాగి ఒక ఎకరాలకు రూ.170, ఈ మొత్తంను 31 జులైలోపు, ఒక ఎకరా కంది పంటకు రూ.400 ఈ మొత్తంను రైతులు జులై 31వ తేదీలోపు చెల్లించాల్సివుంటుందన్నారు. అలాగే వేరుసెనగ ఒక ఎకరాకు రూ.560, టమోటా ఒక ఎకరాకు రూ.1,500 బీమా ప్రీమియం చెల్లించాల్సివుంటుందన్నారు.

## మెగా పిటిఎం నిర్వహణకు సత్వరం నిధులు విడుదల

**- రాష్ట్ర వైఎస్‌ఆర్‌టిఎ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్**

**చిత్తూరు, జులై 21 ప్రభాతవార్త:**



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పిటిఎం(పేరెంట్ టీచర్స్ మీటింగ్) నిర్వహణకు ప్రభుత్వం సత్వరం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైఎస్‌ఆర్ కాంగ్రెస్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రెడ్డిశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 24న పాఠశాలల్లో మెగా పిటిఎం కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, ఆ రోజున పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుర పోటీలు, టగ్ ఆఫ్ వార్, తదితర పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అలాగే ఆ రోజు పాఠశాలల ఆవరణలో కార్యక్రమంను వైభవంగా నిర్వహించ డానికి కుర్చీలు, షామియానాలు, ఫ్లెక్సిలు, స్వాగతం బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. అయితే ఇదంతా నిర్వహించడానికి ప్రస్తుతం పాఠశాలల్లో నిర్వహణ గ్రాంట్లు ఏ మాత్రం లేవని, తామే ఖర్చు పెట్టాల్సివుంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెగా పిటిఎం నిర్వహించాలని పేర్కొంటున్నప్పటికీ ఈ కార్యక్రమం నిర్వహణకు పాఠశాలలకు నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వం ముందుగా నిధులు విడుదల చేస్తే ఉపాధ్యాయులకు సౌకర్యంగా వుంటుందని, మెగా పిటిఎం ఘనంగా నిర్వహించుకోవచ్చునన్నారు.

## అత్యాచారం యత్నం కేసులో నిందితుడు అరెస్టు

**బంగారుపాళ్యం, జులై 21 ప్రభాతవార్త:**



మండలంలోని తగ్గువారిపల్లి పంచా యతీ పరిధిలోని ఆండారెడ్డిపల్లి గ్రామం లో ఈ నెల 17వ తేదీ ఓ మైనర్ బాలికపై అత్యాచార యత్నం జరిగింది. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి జిల్లా కోర్టుకు హాజరుపరచినట్లు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. గంగవరం మండలం అరసనపల్లి గ్రామంకు చెందిన హరిబాబు(42) ఆండారెడ్డిపల్లిలోని తమ బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో 14 సంవత్సరాల మైనర్ బాలికపై అత్యాచారం యత్నం చేశాడు. అనంతరం ఈ విషయంపై తల్లిదండ్రులు బాలికను విచారించగా జరిగిన విషయంను తెలియజేసింది. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ వెల్లడించారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం



**కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త:**
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వా మి వారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తురాలు మంగళవారం లక్ష రూపాయలను విరా ళంగా అందజేశారు. ఈమేరకు యాదమరి మండలం బండివాండ్లవూరుకు చెందిన బి.జానకి అనే భక్తురాలు శాశ్వత నిత్యా న్నదాన పథకంకు 1,00,116 రూపాయ లను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, బాలాజినాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పిం చి తీర్థ,ప్రసాదాలనుఅందజేశారు. ఈకార్యక్రమంలోఆలయఅర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో గురుజాల ఎమ్మెల్యే

**కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త:** పల్నాడు జిల్లా గురుజాల ఎమ్మెల్యే ఎరపతి నేని శ్రీనివాసరావు మంగళవారం కుటుంబ సమేతంగా కాణి పాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ప్రోటో కాల్ ఏఈఓ ధనపాల్, ఏఈఓ రవీంద్ర బాబు,అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవ లో పాల్గొన్నారు. అలాగే ఆయన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, తీర్థ, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.



## 29న కాణిపాకంలో శాకాంబరి అలంకారం

**కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త:**
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఈనెల 29న ఆషాడ పౌర్ణమి సందర్భంగా శాకాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈసందర్భంగా దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలోని శ్రీమరగదాంభికా దేవి, దుర్గాదేవి అమ్మవార్లకు, ప్రధాన ఆలయంలో శాకాంబరి అలంకారం (వివిధ రకాల కూరగాయలు,పండ్లుతో) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆషాడ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి శాకాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. శాకాంబరి అలంకారం కోసం కావలసిన వివిధ రకముల్లైన కూరగాయలను ఉచితంగా స్వీకరించనున్నట్లు తెలిపారు. కూరగాయలు సమర్పించే భక్తులు ఈనెల 28న శివాలయంలో అర్చకులకు సమర్పించాలని తెలిపారు.

## బి.యస్.పి చంద్రగిరి అసెంబ్లీ ఇనార్జీ1గా కొత్తకోట రామమూర్తి నియామకం



***పాకాల, జూలై 21, ప్రభాతవార్త*** బహుజన సమాజ్ పార్టీ (బి.యస్.పి) చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పాకాల మండలానికి చెందిన కొత్తకోట రామమూర్తిని చంద్రగిరి అసెంబ్లీ ఇన్చార్జ్ 1గా నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి మరియు జోన్ఇన్చార్జ్ కె. ప్రభాకర్ నియామక పత్రాన్ని జారీ చేశారు. బహుజన సమాజ్ పార్టీ ఆదేశాలను, సిద్ధాంతాలను అనుసరిస్తూ చంద్రగిరి నియోజకవర్గంలో పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయడానికి, ప్రజా సమస్యలపై పోరాడటానికి రామమూర్తి కృషి చేయాలని అధిష్టానం కోరింది. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన బి.యస్.పి పార్టీ నాయకత్వానికి కొత్తకోట రామమూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## అధికారులు,ప్రజాప్రతినిధుల్లో సమన్వయం అవసరం

**- టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్**

**శాంతిపురం, జూలై 21 ప్రభాతవార్త**



అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో పనిచేసి మండలాన్ని ఆదర్శంగా చేద్దామని మండల టిడిపి అధ్యక్షుడు ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య అధికంగా ఉందని నేతలు పేర్కొన్నారు. మంచినీరు, డ్రైన్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. డ్రైన్ల సమస్యలు పరిష్కరించాలని పిడిఓలను ఆదేశించారు. సమావేశంలో ఉప ఎంపిడిఓ రవినాయక్, ప్రజాప్రతినిధులు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, మణి, రాజేంద్ర, బాలు, ఉమాపతి, చంద్ర, గిరిధర్, నాగరాజు, మంజునాథ్, పిడిఓలు, ఎఇలు పాల్గొన్నారు.

## రైతులు పంటకు బీమా చేయించుకోండి

**పాలసముద్రం, జూలై 21 ప్రభాతవార్త**



మండలంలోని తిరుమలరాజపురం, కోదం డ రామాపురం గ్రామాలలోని రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి ఢిల్లీ ప్రసాద్ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు పడే సూచనలు తక్కువ గా ఉండడంతో వేరుశనగ పంట వేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం చేయించుకుని పంట ఎండిన దానికి ప్రభుత్వం భీమా చెల్లిస్తుందని ఒక ఎకరా వేరుశనగ 560 రూపాయలు బీమా చేయించుకుంటే పంట ఎండినచో 25 వేల నుంచి 30 వేల రూపాయల వరకు ప్రభుత్వం పంట నష్టం కింద రైతుల ఖాతాలో జమ చేస్తున్నది ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయాధికారి తెలిపారు. వేరుశెనగ పంటతో పాటు టమేటా పంటకు కూడా ఈ బీమా వర్తిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. యూరియా కావలసిన రైతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా యూరియా తీసుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వి ఎస్ ఏరా వసంతరావు రైతులు పాల్గొన్నారు.

## దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : జడ్పిటిసి

**బైరెడ్డిపల్లి జూలై 21 ప్రభాతవార్త**
బైరెడ్డిపల్లి మండలం కైగల్ గ్రామానికి చెందిన చంద్రప్ప అతని కుమారుడిపై అదే గ్రామానికి చెందిన చిన్నరెడ్డప్ప తోబాటు ఇంకొంతమంది దాడి చేసి గాయపరిచారని బాధితుడు పోలీసు వారికి ఫిర్యాదు చేయడం జరిగినది. సంబంధిత పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ విషయమై బాధితుడి భార్య తమ భర్త పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అదుపులోకి తీసుకొని తమకు న్యాయం చేయాలన్నారు. బాధితుడికి కాలు విరగడంతో శాస్త్ర చికిత్స చేసినట్లు సంబంధిత డాక్టర్లు తెలియజేశారు. ఈ విషయమై జిల్లా పరిషత్ సభ్యులు కేశవులు మాట్లాడుతూ బాధితులకు పార్టీలకు అతీతంగా న్యాయం చేయాలని తెలియజేశారు.

## అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న లారీ సీజ్.

**గుడుపల్లి, జూలై 21 ప్రభాతవార్త**



గుడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా సోమవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా గ్రానైట్ ను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు గుడిపల్లి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వాహనంను తనిఖీ చేయగా గ్రానైట్ ర వాణా కు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనం సీజ్ చేసి మైనింగ్ ,రవాణా శాఖకు అప్పగించామన్నారు. మండలంలో ఎవరైనా అక్రమంగా గ్రానైట్ ,ఇసుక, ఇతర ఖనిజాలు రవాణా చేస్తే చట్టపురంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## విద్యుత్ సమస్యలకు పరిష్కార చర్యలు

**రామకుప్పం, జూలై 21 ప్రభాతవార్త**



మండలంలోని విద్యుత్ సమస్యలపై ఎప్పటి కప్పుడు పరిష్కార చర్యలు తీసుకుంటా మని కుప్పం రెస్కో ఎండి సోమశేఖర్, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బల్ల, ఆరిమానిపెంట, ఎస్ గొల్లపల్లి, పంద్యాల మడుగు, కావలి మడుగు తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలపై పర్య టించారు. రైతులకు లో వోల్టేజ్ కారణంగా విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. త్రాగునీటి సమస్యతో పలు గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేత నారాయణ చారి, నేతలు చంద్రశేఖర్ రెడ్డి, డి ఈ సాగర్, ఎడి శంకర్, రాంబాబు, రాజారెడ్డి, రెస్కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హోమియోపతి వైద్యాధికారిగా సుగంధ్

**రామకుప్పం ,జూలై 21 ప్రభాతవార్త**



రామకుప్పం మండల పిహెచ్‌సిలో ఆయుష్ హోమియోపతి వైద్యాధికారిగా సుగంధ్ నియమితులయ్యారు. ఆసుపత్రిలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆసుపత్రిలో అందుబాటులో ఉంటామన్నారు. రోగులు హోమియోపతి మందులతో రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మామిడి రైతులు సబ్సిడీ రాయితీని సద్వినియోగం చేసుకోండి

**రామకుప్పం, జూలై 21 ప్రభాతవార్త**
మండలంలోని తోతపురి మామిడి రైతులు ప్రభుత్వ అందిస్తున్న నాలుగు రూపాయలు రాయితీ చేసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి డింపుప్రియ తెలిపారు. ఈనెల 28 లోపు రైతులు రాజుపేట రోడ్డులోని వే బ్రిడ్జి కాటాలు తూకాలు వేయించుకొని బిల్లులు, పాసుపుస్తకం , ఆధార్ కార్డు, బ్యాంకు వాస పుస్తకం జిరాక్స్ అధికారులకు అందించాలన్నారు. ఉదయం కాళీ వాహనాన్ని తూకం వేయించుకొని సాయంత్రం 8 గంటల లోపు వే బ్రిడ్జిలో తూకాలు వేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## డిఇఓ లక్ష్మీనారాయణను సత్కరించిన ఎస్టీయు నేతలు

**చిత్తూరు, జులై 21 ప్రభాతవార్త:**



జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనం గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారా యణను మంగళవారం జిల్లా ఎస్టీయు నాయకులు ఆయన కార్యాల యంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడు తూ ఈ విద్యాసంవత్సరం టెన్త్ పరీక్షా ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేవిధంగా పాఠశాలల్లోని విద్యార్థులకు సిద్ధం చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు వున్నా తనను నేరుగా కలిసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ ఎస్టీయు నాయకులు గంటామోహన్, జిల్లా నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, దేవరాజులురెడ్డి, రాధాకుమారి, ఉమా, ప్రమీళ, కుమారి, చంద్రన్, ఢిల్లీ ప్రకాష్, చిట్టిబాబు, సుబ్రమణ్యంపిళ్ళై తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## అర్హులకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగించాలి

**- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం**

**- అధికారులు..ప్రజాప్రతినిధుల సమన్వయం కీలకం !!**



**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త**
సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభు త్వ పథకాల్లో లబ్ది కలిగించాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ఆదేశించారు. మంగళవారం కడ సమావేశ మందిరంలో కుప్పం మం డల అధికారులు, ప్రజాప్ర తినిధులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈసమావేశంకు పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్, రెస్కోఛైర్మన్ ప్రతాప్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సుపరిపాలన, అభివృద్ధి విజన్‌కు అనుగుణంగా ప్రతి ప్రభుత్వ శాఖ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెంచేలా సేవలు అందించాలన్నారు. ప్రజా సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ప్రభుత్వం పట్ల సంతృప్తస్థాయిలో ఉండేలా పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని గ్రామాల్లో సమస్యల పరిష్కారం పట్ల చొరవ చూపాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ప్రజలకు చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడంలో అధికారులు, నాయకులు కీలకంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో పిఏసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, కార్పొరేషన్ డైరెక్టర్లు శరవణ, మణి, పార్థసారథి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు హైదర్ వలీ, చంద్రశేఖర్, స్థానిక నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

**- ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్**

**చిత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:**



బాలికలు ధైర్యంగా, ఆత్మస్థైర్యంతో ముందుగు సాగాలని, అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పిలుపు నిచ్చారు, మంగళ వారం వల్లియప్పనగర్‌లోని సాంఘీక సంక్షేమశాఖ బాలికల వసతిగృహాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రాష్ట్రప్రభుత్వం అందించిన మెటీరియల్స్( షూస్, బెడ్‌షీట్, టవల్, స్వెట్టర్, డ్రెస్)ను విద్యార్థినులకు పంపిణీ చేసారు. ఎమ్మెల్యే విద్యార్థులతో ముఖాముఖీగా వారి కుటుంబపరిస్థితి ఆశయాలు, చదువులు తదితర అంశాలపై మాట్లాడుతూ వారి ఆశయాలకు అనుగుణంగా ముందుకుసాగాలని, ఇందుకు అవసరమైన సహాయసహకాలు అందిస్తామన్నారు, రాష్ట్రంలో కూటమిప్రభుత్వం, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ విద్యార్థుల భవిష్యత్తు కోసం మంచి నిర్ణఆలు తీసుకొని విద్యావ్యవస్థలను నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల కోరిక మేరకు టివి అందిస్తామన్నారు. లోకజ్ఞానం పెంచుకోవాలని, ఆంగ్లం ఇతర భాషలపై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో కలసి అల్పాహారం తీసుకొన్నారు. కార్యక్రమంలో సాంఘీకసంక్షేమ అధికారి రబ్బానీభాష, ఇన్‌ఛార్జి ఎఎస్‌డబ్ల్యువో వాసంతి, వార్డున్లు, కూటమినాయకులు ఈశ్వరరావు, రాము, చిట్టిబాబు, జీవరత్నం,గౌరి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గుండె సంబంధిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**చిత్తూరురూరల్, జూలై 21 ప్రభాతవార్త:**
చిత్తూరుపట్టణం, మిట్టూరుకు చెందిన శంకరబాబు నటరాజ్ మొదలియార్ 50వ జన్మదినోత్సవంను పురస్కరించు కొని వైదేహి హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత హృదయ వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వసంతకుమార్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే వైద్యపరీక్షలు చేయించుకొని, వ్యాపారవేత్త శంకబాబు చేతుల మీదుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. అలాగే పట్టణ ప్రముఖులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీనివాస్,రాజు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం

**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కారంకే ప్రజాద ర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆయన తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహంకు పూజలు చేసి నివాళులు అర్పించిన అనంతరం ప్రజాదర్బార్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి వారు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు వ్యక్తిగత, భూ సమస్యలను వివరించారు. సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి విజ్ఞప్తిపై అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## జిఓనెం 396ను ప్రభుత్వం రద్దు చేయాలి

**- కొనసాగుతున్న దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్ !!**



**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటుకు జారీ చేసిన జిఓ నెం 369ను రద్దు చేయాలని దస్తావేజు లేఖరులు పేర్కొన్నారు. కుప్పంలో మంగళవారం సైతం దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో రిజర్వేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయరాదన్నారు. రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేట్ పరం చేయరాదని డిమాండ్ చేశారు. ఇలా చేస్తే దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు, డిటిపి ఆపరేటర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం దస్తావేజు లేఖరుల లైసెన్సులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాగా దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌తో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బోసిపోయింది. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు పార్థసారథి, మహేంద్ర, జగన్నాథరెడ్డి, శంకర్, రఘు, రామస్వామి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కెపిఎస్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు





**కుప్పం, జూలై 21 ప్రభాతవార్త**
పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కుప్పం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు లక్ష్మీ ఈశ్వర్‌చ ంద్‌రెడ్డి (597/600 ), అనితషిజో (590/600)లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డులను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. వీరు అవార్డులతో పాటు ఇరవై వేల నగదు పురస్కారాన్ని సైతం అందుకున్నట్లు ఛైర్ పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ తమ విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దమయంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాళ్లబూదుగూరు సచివాలయంలో పాముల సంచారం

**శాంతిపురం, జూలై 21 ప్రభాతవార్త**



మండలంలోని రాళ్లబూదుగూరు గ్రామ సచివాలయంలో పాముల సంచరిస్తుండడంతో జనం, అధికారులు భయాందోళనలు చెందుతున్నారు. మంగళవారం సచివాలయ ప్రహారీగోడ లోపల నుంచి నాలుగు పాము పిల్లలు ఒకేసారి బయటకు రావడంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయంకు వచ్చిన జనం వాటిని చూసి భయంతో పరుగులు తీశారు. చివరకు అక్కడున్న ఓ వ్యక్తి నాలుగు పాము పిల్లలను చంపడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మరో రెండు పాములు తప్పించుకున్నట్లు స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి సచివాలయం చుట్టు పక్కల పిచ్చి మొక్కలు తొలగింపజేసి పాముల సంచారం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# కోటపోలూరు ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మతులు : ఎమ్మెల్యే నెలవల





సూళ్లూరుపేట, జూలై 21 ప్రభాతవార్త: సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటకు వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుకు వారం రోజుల్లో మరమ్మతులు చేసి ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దామని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం ఆమె కోట పోలూరు గ్రామానికి వెళ్లి ఆర్ అండ్ బి రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోట పోలూరు రోడ్డు మరమ్మతులకు గత మార్చి నెలలోనే 40 లక్షల రూపాయలు మంజూరయ్యా అన్నారు. కాగా ప్రస్తుతం తారు ధరలు బాగా పెరిగిపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్లు ప్రస్తుతం మంజూరైన నిధులతో పనులు చేయలేమని తెలియ జేశారన్నారు. దీంతో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ వారం రోజుల్లోనే ఈ పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని ఆమె కోట పోలూరు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అలాగే కోటపోలూరు గ్రామంలో ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను మరమ్మతులు చేసి ప్రజలకు ఉపయోగపడేలా, మంచినీటి ఎద్దడి తలెత్తకుండా వినియోగంలోకి తీసుకొని వస్తామన్నారు. అలాగే తూర్పుపల్లెలోని కొరిడి, పేర్నాడు రోడ్డును ప్రస్తుత వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు అనుకూలంగా గ్రావెల్ రోడ్డును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్లు, మంచి నీరు సౌకర్యాలు కల్పించే లక్షణంలో భాగంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టిడిపి నేతలు కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, తాటిపర్తి శ్రీనివాసులు రెడ్డి, సామంత మల్లం సుబ్రహ్మణ్యం, బిజెపి నేతలు ఆరణి, విజయభాస్కర్ రెడ్డి, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



సూళ్లూరుపేట, జూలై 21 ప్రభాతవార్త: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యం బారిన పడకుండా ఉండవచ్చునని స్థానిక ఎంపీడీవో వై. వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పడమటి పల్లెలుగా పిలవబడే మంగళంపాడు, ఇలుపూరు, వెలగల పొన్నూరు తదితర గ్రామ పంచాయతీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంగళంపాడు గ్రామంలో రోడ్డుపక్కగా చెత్త గుట్టలు ఉండడాన్ని గమనించి వాటిని తక్షణమే తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యానికి, మంచినీటి వసతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం స్వచ్ఛరథం పనితీరును పరిశీలించారు. మంగళంపాడు గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగనవాడి భవనం శిథిలావస్థలో ఉండడంతో దాని స్థానంలో మరో భవనాన్ని నిర్మించే విధంగా ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అంగన్వాడి టీచర్లకు తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో మెనూ తప్పకుండా అమలు చేయాలని ఆయన చెప్పారు.

## వ్యవసాయంపై దృష్టి సారించాలి :ఏవో



బాలాయపల్లి, జూలై 21 ప్రభాతవార్త : విద్యార్థి దశ నుండే వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయశాఖ అధికారిని సుజాత తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ నందు చదువుకుంటున్న 8,9 తరగతుల విద్యార్థులకు భూసార పరీక్ష ప్రాముఖ్యతపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వనరుల కేంద్రం తిరుపతి, మండల వ్యవసాయ శాఖ ఏవో పి సుజాత ఆధ్వర్యంలో భూసార పరీక్ష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుండే వ్యవసాయంపై దృష్టి సారిస్తే మంచిదని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కె.వి శ్రీనివాస్ మాట్లాడుతూ భూసార పరీక్ష నిర్వహించడం వల్ల భూమిలో లోపించిన దాతువులను తెలుసుకొని తదనుగుణంగా సేంద్రియ ఎరువుల ద్వారా భూసారాన్ని పెంచుకునే అవకాశం ఉందన్నారు. అందువల్ల పంటలు సాగు చేస్తున్న భూమి నుంచి మట్టిని సేకరించి భూసార పరీక్షల కోసం ల్యాబ్కు పంపాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్, సైన్స్ ఉపాధ్యాయురాలు, స్థానిక వ్యవసాయ సహాయకురాలు రాజ్యలక్ష్మి పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యవేడు ఆర్టీసీలో లొల్లి...డిపోకే పరిమితం అవుతున్న సర్వీసులు



సత్యవేడు, జూలై 21 ప్రభాతవార్త:సత్యవేడు నుంచి చెన్నైకి నిత్యం ప్రయాణించే ఉద్యోగుల, కూలీలు, విద్యార్థులు ఆర్టీసీ బస్సు సర్వీసులు తగ్గించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగాలకు, కళాశాలలకు వెళ్లే సమయాల్లో చెన్నై రూట్‌బస్సులను రద్దు చేయడం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తమిళనాడు-ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు నుంచి ప్రతిరోజు వందలాది మంది ఉద్యోగాలు ఉపాధి, విద్య కోసం చెన్నై నగరానికి వెళుతుంటారు. అయితే గత మూడు నెలలుగా రోజుకు ఒక్కో బస్సు సర్వీస్‌ను నిలిపివేస్తుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ప్రయాణికులు పలుమార్లు ఫిర్యాదు చేయగా, రీజినల్ మేనేజర్‌సమస్యను పరిష్కరించాలని డిపో అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డిపో మేనేజర్‌ను ప్రశ్నిస్తే, డ్రైవర్లు డ్యూటీకి రావడం లేదని, తగినంత సిబ్బంది లేరని, డిపోనే తీసేస్తున్నాం అంటూ సమాధానాలు చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సు సర్వీసులను నిలిపివేయడం వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయంకూడా తగ్గిపోతోందని ప్రజలు పేర్కొంటున్నారు. సత్యవేడు-చెన్నై మార్గంలో ప్రయాణించే వందలాది మంది ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. సత్యవేడు డిపోలో సర్వీసులను సక్రమంగా నిర్వహించడం సాధ్యం కాకపోతే, ఉన్నతాధికారులకు నివేదిక పంపి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, అవసరమైతే ప్రైవేటు సంస్థలకు బాధ్యతలు అప్పగించాలని కొందరు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగులు, కూలీలు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చెన్నై రూట్‌లో యథావిధిగా బస్సు సర్వీసులను నడపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఈ సారి రోడ్డెక్కి ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## కాణిపాకం దేవస్థానంలో ఈఓ తనిఖీలు



కాణిపాకం, జూలై 21 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో మంగళ వారం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌లు తనిఖీలు నిర్వహించారు. దేవస్థానం వద్ద వున్న షాపింగ్ కాంప్లెక్స్ ముందు భాగంలో భక్తులు నడిచి వెళ్ళేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌ను అక్కడి వ్యాపారస్థులు ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈఆక్రమణలను ఈఓ దగ్గరుండి తొలగించారు. వ్యాపారస్థులు ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే దేవస్థానం అన్నదాన భవన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా భక్తులకు వడ్డించే అన్న ప్రసాదాల నాణ్యత, అన్నదాన భవన్‌లో పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే అన్నదాన భవన్‌లో భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డిస్తూ అన్నప్రసాదాల నాణ్యతపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ ధనపాల్, అన్నదాన ఇన్‌చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో మరియమ్మకు 5వ స్థానం

**-హెచ్‌ఎం వెంకటరమణ రెడ్డి**



చంద్రగిరి, జూలై 21 ప్రభాతవార్త: స్థానిక శ్రీ పద్మావతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి బి సెక్షన్ విద్యార్థిని బి.మరియమ్మ జాతీయ స్థాయి బి.స్ట్రాంగ్ హీరో పోటీలలో 5వ స్థానం దక్కించుకున్నట్లు హెచ్‌ఎం వెంకట రమణ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ, కాకినాడ డివిజన్ గత ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బి స్ట్రాంగ్ హీరో పోటీలకు ఎపిఎంఎస్‌హెచ్‌ఆర్‌ఈ బాలికల ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థినులు హాజరైనట్లు తెలిపారు. ఈ పోటీలో మరియమ్మ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి 5వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన అవార్డు పంపిణీ కార్యక్రమం ఈ నెల 26న కాకినాడలో నిర్వహించనున్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థిని గైడ్ టీచర్ టి.తులసి, మరియమ్మ హాజరై అవార్డు తీసుకుంటారని అన్నారు. కాగా చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు విద్యాభ్యాసంలో రాణిస్తున్న తీరు రాష్ట్ర స్థాయిలో ఏ కార్పొరేట్ స్కూల్‌కు గానీ, కళాశాలకు గానీ తీసిపోని రీతిగా అద్భుతమైన మార్కులను, ఉత్తీర్ణత సాధిస్తుండట పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఏ మేరకు కృషి చేస్తున్నారో, విద్యార్థినులను ఏ విధంగా ప్రభావితం చేయగలిగి అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారో ఇటువంటి అరుదైన రికార్డులను సాధించడం ద్వారా బోధపడుతున్నది.

## జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన... కేంబ్రిడ్జ్ పాఠశాల విద్యార్థులు



తిరుపతి క్రీడ, జూలై 21 ప్రభాతవార్త: జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని జమ్ము తావి ప్రాంతంలో ఈనెల 24 నుండి 26 వరకు జరిగే ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలలో కేంబ్రిడ్జి పాఠశాల విద్యార్థులు అఖిల్, ఏకాన్త్, హర్ష, అబ్రార్, అహమ్మద్, చైతన్య, అశ్వత్ రెడ్డి పాల్గొననున్నారు. అని కౌన్సిల్ ఫర్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ వారు తెలియపరిచారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ కల్పన, ప్రధానో పాధ్యాయిని వేణుబాల, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులందరు అభినందించారు.

### ఎల్లమ్మ తల్లి ఎల్లమ్మ తల్లి...

## సల్లంగా చూడమ్మా మాయమ్మ తల్లి!

**-శ్రీఎల్లమ్మ గుడి వద్ద భక్తిశ్రద్ధలతో జాతర మహోత్సవం**





రేణిగుంట,జూలై 21 ప్రభాతవార్త: ఎల్లమ్మ తల్లి ఎల్లమ్మ తల్లి సల్లంగా చూడమ్మా ఎల్లమ్మతల్లి అంటూ భక్తులు మంగళవారం భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. రేణిగుంట పట్టణ శివారు సిబిఐడి కాలనీకి వెళ్లే మార్గంలో నిండుగా కొలువైన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయం ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పొంగించి, అంబళ్లు సమర్పించారు. రేణిగుంట పట్టణ పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూ కట్టారు. ఆలయ శాశ్వత ధర్మకర్తలు ఎలుమలై రెడ్డి, సరసమ్మ, తులసి రెడ్డి, భాగ్యమ్మ, బాలాజీ భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం దాదాపు 2000 మందికి అన్నసంతర్పణ భోజనాన్ని శాశ్వత ధర్మకర్తలు దగ్గరుండి వడ్డించారు. విశేషమైన అలంకరణతో శ్రీఎల్లమ్మ తల్లి భక్తులకు కన్నుల పండువగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు విశేష అలంకరణలు శాస్త్రోక్తంగా అభిషేకాలు చేశారు. అమ్మవారి గుడి ముందు శూలం వద్ద భక్తులు పొంగించిన పొంగళ్లను మహాకుంభంగా సమర్పించారు. బుధవారం జాతర చివరి రోజు శ్రీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రేణిగుంట పట్టణం నందు ఊరేగిస్తామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. రేణిగుంట మండల, పట్టణ పుర ప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## శివయ్య ప్రసాదాలకు... తీరిన ఆన్‌లైన్ చింత!

### ఆఫ్‌లైన్‌లో కూడా భక్తులు కోరినన్ని ప్రసాదాలు

శ్రీకాళహస్తి, జూలై 21 ప్రభాతవార్త : శివయ్య ప్రసాదాలకై సుమారు నెల రోజుల పాటు భక్తులు పడిన తిప్పలు, చింతను దేవాదాయశాఖ అర్థం చేసుకుంది. దాంతో ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా భక్తులకు ప్రసాదాలు అందించుటకు అనుమతించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ఆలయ ఇఓ బికె వెంకటేశులు సోమవారం మీడియాకు తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ఇక మీదట అంతా ఆన్‌లైన్ విధానాలు అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రయోగాత్మకంగా శ్రీకాళహస్తీశ్వ రాలయంలో అమలుకు ఆదేశించింది. అయితే ప్రసాదాల విక్రయాలు కూడా ఆన్‌లైన్ చేయటంతో భక్తులు బాగా ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యలను స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ ప్రభుత్వం, దేవాదాయశాఖ దృష్టికి తెచ్చారు. స్పందించిన దేవాదాయశాఖ ఇకమీదట ప్రసాదాలను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా విక్రయాలకు అనుమతించింది. దాంతో ఇక మీదట భక్తులు కోరినన్ని ప్రసాదాలను కొనుగోలు చేసుకొనుటకు వీలు కల్పిస్తూ ఉత్తర్వులు జారి చేసారు. ఈ ఉత్తర్వులు సోమవారం శ్రీకాళహస్తీశ్వరాల యానికి చేరాయి. ప్రతి రోజూ శ్రీకాళహస్తీశ్వరాలయలో సుమారు 30వేల వరకు లడ్డు, వడ, పులిహోర, జిలేబీ ప్రసాదాలు విక్రయించే వారు. ఆన్ చేయటంతో ఈ అ మ్మకాలు ఆన్‌లైన్ అమలుతో కనీసం 10వేలు కూడా విక్రయాలు జరిగేవి కాదు. దాంతో భక్తులకు ప్రసాదాల కొరతతో పాటు శివయ్య ఆదాయానికి కూడా గండి పడింది. ఈ సమస్యలను పాలకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావటంతో నాయకులు స్పందించారు. దేవాదాయశాఖ సహకరించింది. దాంతో ఆఫ్‌లైన్ విక్రయాలకు కూడా అనుమతించింది. కౌంటర్లు ఏర్పాటుకు సంబంధించి ఇఓవెంకటేశుతో చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ చర్చించారు. ఆఫ్‌లైన్‌లో ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుకు ఇరువురు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం నుంచి ఆఫ్‌లైన్లోకూడా భక్తులకు ప్రసాదాలు అందుబాటులో ఉంటాయి.

# సూళ్ళూరుపేట డివిజన్

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



బాలాయపల్లి, జూలై 21 ప్రభాతవార్త: ఏపీఆర్జేసీ కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ప్రిన్సిపల్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎం రామకృష్ణ ఆంజనేయులు, కళాశాల సిబ్బంది ఎమ్మెల్యే రామకృష్ణని కలిసి సత్కరించి కళాశాలకు సంబంధించిన ప్రహరీ గోడ నిర్మాణము, టాయిలెట్స్ నిర్మాణం, విద్యార్థులు కావలసిన ఐరన్ కాట్స్, విద్యార్థులకు అవసరమగు కంప్యూటర్ ల్యాబ్ మొదలగు అవసరాల గురించి వినతి పత్రం ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఎమ్మెల్యేని శాలువతో సత్కరించి అభినందించినారు.

## కుటుంబానికి ఆర్థిక చేయూత



వాకాడు, జూలై 21 ప్రభాతవార్త: మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభిరామాలయం కేంద్రంగా నడపబడుతున్న శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రవాస భారతీయులు, సంస్థ వ్యవస్థాపకులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి, హైమావతమ్మ వారి కుటుంబ సభ్యులు లావణ్య, మధు కిరణ్ రెడ్డిల ఆర్థిక సౌజన్యంతో అనారోగ్యం వలన ఆర్థికంగా వెనకబడిన తాడేపల్లి మధుమూర్తి కుటుంబానికి శ్రీ పట్టాభిరామాలయం ధర్మకర్త, మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర రెడ్డి చేతుల మీదుగా 11 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనూరాధ, శ్రీరామసేన అధ్యక్ష, కార్యదర్శులు హరీష్ రెడ్డి, శివకుమార్, వంశీ, సుబ్రహ్మణ్యం శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంతాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 24వ తేదీన పాఠశాలల్లో మెగా పిటిఎం

వాకాడు, జూలై 21 ప్రభాతవార్త: మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పిటిఎం 3.1 (తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం బడివైపు ఒక అడుగు) నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యొక్క అభివృద్ధి, మధ్యాహ్నం భోజనం, విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర, గత సంవత్సరం విద్యార్థులు సాధించిన ఫలితాలు చర్చించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పాఠశాల అభివృద్ధి కొరకు తల్లిదండ్రులు కూడా సూచనలు సలహాలు చేయాల్సి ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు హాజరై మీ విద్యార్థుల ప్రగతిని, పాఠశాల అభివృద్ధిని పరిశీలించాలని తెలిపారు.

## సుబ్రమణ్యేశ్వరునికి ఆడి నెల విశేష పూజలు



పెనుమూరు, జులై 21 ప్రభాతవార్త: సుబ్రమణ్యేశ్వరునికి ఎంతో ప్రీతిపాత్రమైన ఆడి నెల సందర్భంగా మంగళవారం స్థానిక కన్నికల కొండపై వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు తారకరామశర్మ ఆధ్వర్యంలో అర్చకులు గుంటూరు శివరామశర్మ వేద మంత్రోచ్చారణలతో స్వామి వారి మూలవిరాట్‌కు పాలు, పంచామృత, గంధం, పసుపు, కుంకుమలతో కన్నుల పండుగగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయ ఆవరణలో పిండి దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన వందలాది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు ఉభయదారులు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆడి నెల మంగళవారం ఉత్సవాలకు ఉభయదారులుగా చిత్తూరుకు చెందిన ప్రకాష్‌బాబు, అరుణ దంపతులు, వెదురుకుప్పం మండలం అగ్గిచేనుపల్లికి చెందిన దామోదర్‌రెడ్డి, వసంత దంపతులు, కిషోర్, హరిత దంపతులు, పెనుమూరుకు చెందిన కొర్రా చంద్రశేఖర్, మానస దంపతులు, పెనుమూరు ఫిజియోథెరపీ డాక్టర్ సంపూర్ణ, గందోడపల్లికి చెందిన సుబ్బయ్య అమరావతి దంపతులు, పెనుమూరుకు చెందిన రంగారావు, కుమారి దంపతులు, సోమనందాపురంకు చెందిన శారదమ్మ కుమారుడు రూపేంద్రలు వ్యవహరించారు.

## గుడిమల్లం ఆలయంలో కడప సిఐ



ఏర్పేడు, జూలై 21 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో మంగళవారం కడప సిఐ శ్యాం సుందర్‌రెడ్డి ఆయన సతీమణి హిమబిందులు పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులు ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ చరిత్ర గురించి వివరిస్తూ చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

**PUBLIC NOTICE**

It is hereby informed that the Hon'ble Commissioner (Appeals), Office of the Chief Commissioner of Land Administration (CCLA), AP, Mangalagiri, has posted the Suo Motu Revision Petition under Section 14-A of the Inams Abolition Act, 1956, relating to S.R. No. 13/2012, I.D.T. No.178-A/2012, for hearing on 23.07.2026 at 11.00 A.M.

Sri D. Rajendra Raju, S/o D. Obul Raju, Tiruchanur Village, Tirupati Rural Mandal, and any person in possession of the subject land are requested to appear before the Hon'ble Commissioner (Appeals), CCLA, AP, Mangalagiri, either in person or through an authorized representative with relevant records. Failing which, the case will be decided on the available records.

**Sd/-Tahsildar,**
**Tirupati Rural Mandal**
**Tirupati District**

**ధీర ప్రజ్ఞుడికి అశ్రునివాళి**



**కీ॥శే॥ డా॥ శ్రీ వెడిచర్ల ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి**

మనసంతా మమతల మాధుర్యం, మనిషి అంతా మంచితనం
నీ జ్ఞాపకాలే మా ఉనికి, ఊపిరి ఉత్సాహం, మంచితనానికి నిలువెత్తు
రూపంగా నిలిచిన మీ ఆదర్శం, మా అందరి హృదయాలలో
సుస్థిర స్థానం ఏర్పరచుకున్న నీకు ఘన నివాళులర్పిస్తూ....
ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, మీ కుటుంబ సభ్యులకు
మనోధైర్యాన్ని భగవంతుడు ఇవ్వాలని ప్రార్థిస్తూ...

**ఎం.ఎం.బాబ్జి**, చెన్నై
**ముసునూరు హనుమంతరావు**, చిగురుపాడు
**ముప్పాళ్ళ చంద్రరాజు**, ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడులు, నాయుడుపేట
**గూటూరు శేఖర్**, సీనియర్ జర్నలిస్టు , నాయుడుపేట

# శ్రీకాళహస్తి డివిజన్

## పూడిలో ఎస్.ఐ.ఆర్ పనుల్లో అలసత్వం

### పార్టీకి ప్రజలే బలం - ప్రజలకు వెన్నుదన్నుగా జగన్ 2.0 యాప్ బియ్యపు ఆకర్ష్ రెడ్డి




శ్రీకాళహస్తి జూలై 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణ వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్ రెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి పార్టీకి ప్రజలే బలం–ప్రజలకు వెన్నుదన్నుగా జగన్ 2.0 యాప్ పోస్టర్లను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ కార్యకలాపాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, వైఎస్సార్సీపీపై జరుగుతున్న కుట్రలు, నాయకులు మరియు కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, పార్టీ అధికారిక కార్యక్రమాలు, ప్రెస్‌మీట్‌లు, ప్రజా ఉద్యమాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంలో జగన్ 2.0 యాప్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ప్రతి వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యుడు తప్పనిసరిగా జగన్ 2.0 యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొత్తపాటి శ్రీనివాస్ రెడ్డి ,రేణిగుంట టౌన్ ప్రెసిడెంట్ ప్రభాకర్,వయ్యాల మనోహర్ రెడ్డి, కంఠ ఉదయ్ కుమార్,పఠాన్ ఫరీద్,గోర,శ్రీవారి సురేష్,మున్నా రాయల్, జయ శ్యామ్ రాయల్, కొల్లూరు హరి నాయుడు,మధు రెడ్డి,పసల రమణయ్య, పులి రామచంద్ర, ఫజల్, ముని కృష్ణారెడ్డి, కొట్టే శరవణ,జూమ్లేష, సునీత సింగ్, సాగీర బి,మాధవి,శ్రీదేవి, షర్మిల ఠాగూర్,సుధాకర్ రెడ్డి,అస్లాం, పసల కృష్ణయ్య,పసల సుమతమ్మ, సాదిక్, వెంకటరమణ,ఖదీర్ భాష, బాలిశెట్టి శేఖర్, చింతామణి పాండు,గంగిరెడ్డి,నారాయణ, భాస్కర్, మాతయ్య,ఆర్కార్డ్ ముత్తు, డాక్టర్ శంకర్, వేదం బాల, ఆర్కార్డు శంకర్,మహీధర్, కామి మనోహర్, తిరుపాల్,దివ్య దండా,పుట్ట హరి, ఆర్ట్ మణి,హంస మనోహర్, మణికంఠ, ప్రసాద్ నరేష్, రామచంద్ర రెడ్డి, గురునాథ్ రెడ్డి, రామ్మూర్తి, గురవయ్య, రాఘవరెడ్డి, భాను యాదవ్, కొండయ్యా, అక్షయ్, యాకూబ్, సూర్య, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## నువ్వు బతికున్నా...మా లెక్కల్లో చనిపోయావు!

### బిఎల్ఓ వింత పోకడ



| S.No. | Serial No. | EPIC Number | Elector Name | Relative Details | DOB/Age | Uncollectable Reason |
|---|---|---|---|---|---|---|
| 74 | 994 | UCG2220566 | VENKATESHULU VALLAM | ADEYYA (Father) | (67) | Death |
| 75 | 995 | UCG2220549 | EDDA PENCHALAIAH DAKKILI | NALLAIAH (Father) | (82) | Death |
| 76 | 996 | MNV0981480 | V.KANNAIAH | KRISHNAIAH (Father) | (79) | EF Refused |
| 77 | 999 | UCG2220598 | VENKATAIAH VALLETI | ROSAIAH (Father) | (59) | Untraceable/Absent |
| 78 | 1003 | UCG2220622 | BATHEIAH PASI | TIRUPALAIAH (Father) | (59) | Death |
| 79 | 1004 | UCG2698728 | UDAY KUMAR P | KONDAIAH P (Father) | (25) | Death |
| 80 | 1050 | MNV2269074 | G.UMA | JANARDAN (Husband) | (44) | Untraceable/Absent |
| 81 | 1057 | UCG0229336 | KONETI LAKSHMAMMA | VENKATESU (Husband) | (48) | Death |
| 82 | 1075 | UCG3368357 | GODUGULA SUBBAMMA | CHIRANJEEVULU (Husband) | (38) | Death |
| 83 | 1084 | UCG0298722 | SHEVADA SUBBAIAH | KRISHNAIAH (Father) | (63) | Death |
| 84 | 1085 | UCG2222800 | MUNEIAH MOOLA | LAKSHMAIAH (Father) | (46) | Death |
| 85 | 1087 | UCG2222812 | CHINAMUNI KRISHNAIAH MOOLA | BAYULU (Father) | (47) | Death |
| 86 | 1099 | MNV2270080 | YAM MUNEMMA | JANKAIAH (Husband) | (69) | Death |
| 87 | 1109 | MNV2971075 | VAKATI REVATHI | RAMESHA (Husband) | (37) | Untraceable/Absent |
| 88 | 1111 | UCG0206904 | NAGAMUNTALA JAYARAMAIAH | KRISHNAIAH (Father) | (63) | Untraceable/Absent |
| 89 | 1112 | UCG0964207 | SANTHI BHUSHAN N | CHINNI KRISHNAIAH N (Father) | (41) | Death |
| 90 | 1113 | AAP1945567 | JINKA HANITHA | MANNE DORABABU P (Husband) | (24) | Untraceable/Absent |

① C. ...
② D- Prabhakar,
M Bhagyasri
BLO/Pudi

తొట్టంబేడు, జూలై 21 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం, అల సత్వంతో బతికున్నవారిని చంపేస్తున్నారు. ఇదేమి అని అడిగితే సమాధానం చెప్పె దిక్కులేదు. ఈ వింత వాదనలు, సంఘ టనలు సర్ పరిశీలనలో వెలుగు చూస్తు న్నాయి. వివరాలు పరిశీలిస్తే మండలంలోని పూడి గ్రామపంచాయతీ పరిధిలో జరుగు తున్న ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పరిశీనల్లో సిబ్బంది అలసత్వం కనిపిస్తోంది.

క్షేత్రస్థాయి పరిశీలన చేయ కుండానే బతికున్న వారిని కూడా మృతులుగా నమోదు చేయడంతో గ్రామంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బతికుండగానే "డెత్" లిస్ట్ లో పేర్లు: కొత్తగా రూపొందించిన ఎస్.ఐ.ఆర్ డ్రాఫ్ట్ జాబితా ప్రకారం పూడి గ్రామంలో పలువురి పేర్లను "డెత్ ఉంట్రాసెబుల్ /ఆబ్సెంట్ కేటగిరీలో చేర్చారు. 37 ఏళ్ల యువతి, 44 ఏళ్ల మహిళ, 63 ఏళ్ల వ్యక్తి వంటి వారిని ఆచూకీ లేదని తొలగించడం గ్రామస్తులను ఆశ్చర్యానికి గురిచేసింది. "మా కళ్ల ముందు తిరుగుతున్న వాళ్లనే చనిపోయారని రాశారు. ఇది కావాలని చేసిన కుట్రలా ఉంది" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్షేత్ర పరిశీలన లేకుండానే సంతకాలు:**

గ్రామంలోకి వచ్చి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాల్సిన బీఎల్ఓ, బీఎల్ఏలు ఆ పని చేయకుండానే కూర్చున్న చోటు నుంచే జాబితాలు తయారు చేసి సంతకాలు పెట్టారనే ఆరోపణలు వస్తున్నాయి. దీని కారణంగా అర్హులైన లబ్ధిదారులు రేషన్, పెన్షన్, ఆరోగ్యశ్రీ వంటి ప్రభుత్వ పథకాలకు, రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కుకు కూడా దూరమయ్యే ప్రమాదం ఉంది.ఈ హక్కు కోల్పోతే ఇతర ప్రభుత్వ సదుపాయాలు అందవని ఉన్నతాధికారులే చెబుతున్నారు.మరి ఇంతటి ప్రాధాన్యత అంశంపై గ్రామస్థాయి పంచాయతీ అధికారుల్లో ఎందుకు నిర్లక్ష్యం? అని చర్చించుకున్నారు.

**ఫిర్యాదు చేసినా స్పందించని బీఎల్ఓ:**

తప్పులు సరిచేయాలని బాధిత కుటుంబాలు బిఎల్ ఓ పూడి గ్రామంలో వ్యవహరిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారిని కలిసినా సరైన సమాధానం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఆర్డిఓ దగ్గరకు వెళ్తే తర్వాత చూద్దాం అని దాటవేస్తున్నారు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి?" అని ఒక బాధితురాలు కన్నీరు పెట్టుకుంది. ఈ అంశంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఈఆర్ఓ స్థాయి అధికారులు జోక్యం చేసుకుని జాబితాను మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. తప్పుడు ధ్రువీకరణలు చేసిన బీఎల్ఓ, బీఎల్ఏలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజాస్వామ్యానికి మూలమైన ఓటు హక్కును కూడా ఇలా తొలగిస్తే ఎలా? ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి' అని గ్రామ పెద్దలు అంటున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు ఏమేరకు చర్యలు తీసుకుంటారోనని పూడి గ్రామస్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## వధువుగా ద్రౌపదీ దేవి ఊరేగింపు





శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వధువుగా ద్రౌపదమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం ఆవరణలో అంగరంగ వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశు,డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి హాజరు కాగా కళ్యాణోత్సవం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి కళ్యాణ మంత్రాలను పఠిస్తుండగా స్థానిక ఆచారం మేరకు ఆలయ అర్చకులు పురుషోత్తం నిర్వహించారు. కాగా కళ్యాణోత్సవం తరువాత అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపు లో ద్రౌపదీ అమ్మవారు వధువుగా దర్శనమిచ్చారు. సమయ పాలనతో కళ్యాణోత్సవం గ్రామోత్సవం నిర్వహించటంతో భక్తులు దర్శించుకున్నారు.ఏర్పాట్లను ఆలయ ఎఇఓ హేమామాలిని, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య పర్యవేక్షించారు.గ్రామోత్సవంను ఆలయ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, దుర్గా ప్రసాద్‌ల సారథ్యంలో సాగింది.

## విద్య,పరిశోధనలను ప్రోత్సహించేందుకు 'నామ్‌టెక్‌తో'ఒప్పందం



శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త : పరిశ్రమల నేతృత్వం లోని ఇంజనీరింగ్ విద్య, పరిశోధనను ప్రోత్సహించేందుకు తిరుపతి ఐఐటి బుధవారం నామ్‌టెక్ తో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి.ఇక్కడ మూడురోజుల వర్క్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధ వారం కీలక అంశంపై ఒప్పందం కుదిరింది.ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటిలో విద్యతో పాటు సామాజిక కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.బుధవారం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్‌సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటి యొక్క విద్యా నైపుణ్యాన్ని, నామ్‌టెక్ యొక్క పరిశ్రమ సమన్వయ విధానంతో మేళవించడం ద్వారా, భారతదేశ ఉత్పాదక, సాంకేతిక ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే ప్రతిభను అభివృద్ధి చేయడమే ఈ సహకారం లక్ష్యమన్నారు.

**టెక్నాలజీ నైపుణ్యాన్ని పెంచటమే లక్ష్యం:**

భారతదేశంలోని సెమీకండక్టర్ తయారీ, ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ రంగాలలో నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని అభివృద్ధి చేయడానికి ఒక దీర్ఘకాలిక సహకార చట్రాన్ని ఏర్పాటు చేసేందుకు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా వారితో ఐదేళ్ళ ఒప్పందాన్ని చేసుకుందన్నారు. లాభాపేక్ష లేని విద్యా కార్యక్రమమైన న్యూ ఏజ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ ఫౌండేషన్ స్థాపించిన న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నామ్‌టెక్) ఒక అవగాహన ఒప్పందం ( ఎంఓయు)పై సంతకాలు చేసినట్లు డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. సెనేట్ హాల్‌లో జరిగిన ఈ సంతకాల కార్యక్రమానికి ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఎన్. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి కాంపిటెన్సీ డెవలప్‌మెంట్ అండ్ అవుట్‌రీచ్ (సిడిఓ) డీన్ ప్రొఫెసర్ అరుణ్ కె. తంగిరాల, సెంటర్ ఫర్ స్పాన్సర్డ్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ అనిల్ కుమార్ ఎమదాబతుని: ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి మరియు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.పి.నవీన్; కాంపిటెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ (సీడీపీ) సలహాదారు డాక్టర్ సుబ్రహ్మణ్యం గోర్తి; రిజిస్ట్రార్ బ్రిగేడియర్ డాక్టర్ కె. పి. కృష్ణ కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీమతి రుచిక ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీమతి గోమతి, డైరెక్టర్ జనరల్ సీఈఓ డాక్టర్ ఇబ్రహీం హఫీజుర్ రెహమాన్; డీన్‌అకాడమిక్స్ డాక్టర్ సంజీవ్ గుప్తా; ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ దేవాంగ్ జోషి; నామ్‌టెక్ స్కూల్ ఆఫ్ సోషల్ ఇంపాక్ట్ డైరెక్టర్ శ్రీ సందీప్ అచంతాని; స్కూల్ ఆఫ్‌స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ పాఠక్; డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీ అంకిత్ సింగ్ తన్వర్, నామ్‌టెక్ నుండి కీలక సభ్యులతో కలిసి జూమ్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**వికసిత్ భారత్ లక్ష్యంగా :**

అవగాహన ఒప్పందం నిబంధనల ప్రకారం, ఐఐటి తిరుపతి మరియు నామ్‌టెక్ సంస్థలు విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లు మరియు ఇండస్ట్రీ ఇమ్మర్షన్, ఉమ్మడి యాక్షన్ రీసెర్చ్ ప్రాజెక్టులు, అధ్యాపకుల సామర్థ్య అభివృద్ధి, కన్సల్టెన్సీ అసైన్‌మెంట్లు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ మరియు సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, ఇంకా కాన్ఫరెన్సులు, వర్క్‌షాపులు, హ్యాకథాన్‌ల వంటి ఉమ్మడి అవుట్‌రీచ్ కార్యక్రమాలతో సహా పలు రంగాలలో సహకరించుకుంటాయి. విక్సిత్ భారత్ 2047 మరియు జాతీయ విద్యా విధానం 2020 కింద భారతదేశం యొక్క విస్తృత ఆశయాలకు మద్దతుగా, ఐఐటి తిరుపతి యొక్క విద్యా మరియు పరిశోధన సామర్థ్యాలను, నామ్‌టెక్ యొక్క పరిశ్రమఅనుకూల, ఇండస్ట్రీ 4.0కేంద్రీకృత శిక్షణా వ్యవస్థతో ఏకం చేయడానికి ఈ భాగస్వామ్యం రూపొందించబడింది.ఈ అవగాహన ఒప్పందం ఐదేళ్ల ఉంటుంది. భారతదేశ సాంకేతిక విద్య, పారిశ్రామిక ప్రతిభావంతుల సరఫరాను బలోపేతం చేయడానికి ఇరు సంస్థల ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది.

### పరశురామేశ్వరుని సేవలో మాక్స్ ఇన్‌ఫ్రా అధినేత

## ఏడాది అన్నదానానికి విరాళం



ఏర్పేడు,జూలై 21 ప్రభాతవార్త: గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని సేవలో మంగళవారం మాక్స్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్స్,మన ఇన్‌ఫ్రా అధినేతలు పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన ద్వారం వద్దఆలయ చైర్మెన్ బత్తల గిరినాయుడు సారథ్యంలో ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. మాక్స్ ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్స్ అధినేత బివిఎస్ ఎన్ రాజు, మన ఇన్‌ఫ్రా అధినేత మస్తాన్‌నాయుడు, కృష్ణమోహన్, విజయభాస్కర్‌రెడ్డిలు వచ్చారు వారికి వేదపండితులు ఆలయాధికారులు ఆలయ మర్యాదలతోస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి బోర్డు చైర్మెన్ బత్తల గిరినాయుడు వివరించారు. ఆలయాభివృద్ధికి సంబంధించి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రణాళికలను చైర్మెన్ వివరించారు. ఈ సందర్భంగా అతిధులు ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఏడాదికి ఎంత ఖర్చు అవుతుందో తాము భరిస్తామని చైర్మెన్‌కు భరోసా ఇచ్చారు. వారికి వవేదపండితులచే ఆశీర్వదించి. తీర్థ ప్రసాదాలను అందించారు. దుశ్శాలువలతో సత్కరించారు.

## ఆడికృత్తిక మహోత్సవ పత్రికల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని పాపా నాయుడుపేటలో జరిగే ఆడికృత్తిక మహోత్సవాలు గోడపత్రికలను మంగళవారం ఇక్కడి శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పాపానాయుడు పేటలో వెలసిన వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఆలయ 4వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆహ్వానంగా గోడపత్రికలను ముద్రించారు. వాటిని ఆలయ చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ చే ఆవిష్కరింపజేసారు.ఈ సందర్భంగా సుబ్రమణ్యం స్వామి ఆలయ కమిటి సభ్యులు కొట్టెసాయి ప్రసాద్‌కు ఆహ్వాన పత్రికలను అందించారు.ఈ సందర్భంగా కొట్టెసాయి ప్రసాద్ మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాల్లో తాను పాలుపంచుకొనుటకు ఆ భగవంతుడు పవన్‌కళ్యాణ్ రూపంలో వరమిచ్చాడన్నారు.

## అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16కాళ్ళ మండపం వద్ద వెలసిన ఆంజనేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని దిగువ సన్నిధివీధిలోనూ ఆంజనేయ స్వామి ఆలయాలు వెలసినాయి. అక్కడ ప్రతి మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఆలయంలోని 16కాళ్ళ మండపంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు తులసీ సారధ్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజల నిర్వహణకు భక్తులు ము ందుకు వచ్చారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. తరువాత స్వామి వారికి ఆలయ ఇఓ బికె వెంకటేశు సంకల్పంతో హారతులిచ్చారు.ఈ సందర్భంగా హాజరైన భక్తులకు అర్చకుడు సూచిస్తూ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న వారికి పూజలు,అభిషేకాల్లో పాల్గొన్న వారికి ఆరోగ్యం, ఐశ్వర్యం, ధైర్యం, విజయాలు, శత్రుబాధలు నివారణతో పాటుసకల శుభాలుకల్గుతాయని వివరించారు.ఈ సందర్భంగా అభిషేకాల అనంతరం ప్రత్యేక అలంకారాల జరిపారు. ఆలయ ఇఓ బికె వెంకటేశు ఆదేశాలతో అనుబంధ ఆలయాల్లో పూజలు, అభిషేకాలు,సేవలందిస్తున్నారు.

## మన ఊరు మన బీజేపీ జెండా ఆవిష్కరణ



శ్రీకాళహస్తి రూరల్ జూలై 21 ప్రభాతవార్త: 'దేశం కోసం, ధర్మం కోసమే పుట్టిన పార్టీయే బీజేపీ" అని భారతీయ జనతా పార్టీ ..రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ అన్నారు. మండలంలోని అమ్మపాలెం పంచాయతీలో బూత్ కమిటీ అధ్యక్షులు నిడిగంటి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "మన ఊరు మన బీజేపీ జెండా"కార్యక్రమానికి కోలా ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామ పెద్దల సమక్షంలో జెండాను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలు సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి చేరడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పమని తెలిపారు.భారత్ ను 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలపడమే మోదీ దృఢ నిశ్చయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డిజిల్లా కిషాన్ మోర్చా అధ్యక్షులు కునాటి నాగరాజుమండల అధ్యక్షులు బాగిత్తి వెంకటేష్, బూత్ కమిటీ అధ్యక్షులు నిడిగంటి రామకృష్ణారెడ్డి,టీడీపీ నేతలు కందాటి వీరారాఘవ రెడ్డి, పొలంరెడ్డి బత్తిరెడ్డి, చంద్రారెడ్డి, రామిరెడ్డి, నిరంజన్ రెడ్డి, శివారెడ్డి, సిద్దగుంట సుధాకర్ రెడ్డి, కందాటి రాంబత్తిరెడ్డి, బీజేపీ నేతలు టి. చెంగలరాయ రెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు, రాఘవులు నాయుడు, అబ్బాబట్లపల్లి శివా, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం లోపల నాయకుల ఫ్లెక్సీలు... భక్తుల ఆవేదన

### ఇదేమి కొత్త ట్రెండ్




శ్రీకాళహస్తి జూలై 21 ప్రభాతవార్త: ధార్మిక క్షేత్రాలుగా విరాలజిల్లుతున్న శ్రీకాళహస్తిలో ఫ్లెక్సీల సంప్రదాయం,సంస్కృతికి స్వస్తి చెప్పాలని నాయకుడు అంటుంటే అనుచరులు, మిత్రపక్షం ఫ్లెక్సీల మోజులో సంప్రదాయాలకు స్వస్తి చెప్పారు.ఈ నేపథ్యంలో ద్రౌపదీ సవమేత ధర్మరాజుల స్వామి ఆలయం సమీపంలో చైర్మెన్ అనుచరులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం చర్చనీయాంశంగా మారింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి దేవస్థానం అనుబంధ ఆలయమైన ద్రౌపది సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలోపల నాయకుల ఫ్లెక్సీలు ఉండటంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ఈసారిస్వామివారి సన్నిధానంలోపల నాయకుల ఫ్లెక్సీలు కట్టి ఉండటాన్ని చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఈవో సారూ ముందు ఆలయంలోపల నాయకులు ఫ్లెక్సీలు కట్టుకోవచ్చా? లేక స్వామివారి ఫ్లెక్సీలకు మాత్రమే పర్మిషన్ ఉందా? అని ప్రశ్నించారు. ఆలయ పవిత్రతకు భంగం కలిగించేలా లోపల ఫ్లెక్సీలు ఉండటం సరికాదని, దీనివల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయం లోపల ఉన్న ఫ్లెక్సీలను తొలగించి, స్వామివారి ప్రతిష్టను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



ఏర్పేడు, జూలై 21 ప్రభాతవార్త: యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మంగళవారం ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీ లోని సహాయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, మానసిక రోగులకు మధ్యాహ్న భోజనం అందజేశారు. మదనపల్లికి చెందిన నజీర్ వారి కుటుంబ సభ్యులసహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నజీర్, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు భగవంతుని ప్రార్థించారు. ఈ సందర్భంగా యువ నేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకులు మునిశేఖర్, యువ నేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వినోద్ మాట్లాడుతూ ఎవరూ ఆకలితో చనిపోకూడదనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు వంశీ, యుగంధర్, వెంకటేష్, భాస్కర్, దాము తదితరులు పాల్గొన్నారు.

## బేటీ బచావో బేటీ పఢావోపై అవగాహన

### రౌతు సూరమాలలో ఐసిడిఎస్ కార్యక్రమం




తొట్టంబేడు, జూలై 21 ప్రభాతవార్త: బేటీ బచావో బేటీ పఢావో పథకంపై ఐసిడిఎస్ సూపర్వైజర్ మారియమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండలంలోని రౌతు సూరమాల పంచాయతీ శాస్త్రి గిరిజన కాలనీలో మంగళవారం శ్రీకాళహస్తి సిడిపిఓ శాంతి దుర్గఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ మారియమ్మ మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు తల్లిబిడ్డల సంరక్షణ, లైంగిక వేధింపులు..పై అవగాహన కల్పించారు. పోక్సో, నిర్భయ చట్టాలు గురించి వివరించారు. అదేవిధంగా మద్యపానం, ధూమపానంవల్ల కలిగే అనర్థాల గురించి కూడా వివరించారు.ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, అంకమ్మ, సంధ్య, తల్లులు, కిషోరి బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రమణ్యం స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి,జూలై 21 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సుబ్రమణ్యం స్వామి ఆలయాలు మంగళవారం అమావాస్య సందర్భంగా కిట కిట లాడాయి. మంగళవారం సుబ్రమణ్యం స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆలయంలోని రంగుల గోపురం వద్ద ఉన్న సుబ్రమణ్యం స్వామి,అలాగే మూక తీర్థం ఎదురుగా వెలసిన చెంగల్వరాయ స్వామి ఆలయం,కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి, తేరువీధిలో వెలసిన షణ్ముఖ స్వామి ఆలయం వద్ద విశేష పూజలు అభిషేకాలు నిర్వహించారు. షణ్ముఖ స్వామి వందలాది లీటర్ల పాలతో స్వామి వారికి అభిషేకించారు. మధ్యాహ్నం రాత్రి ప్రత్యేక అలంకారాలు జరిపారు.కాగా మధ్యాహ్నం లస్సి, రాత్రి పెరుగన్నం, కిచ్చడిలను భక్తులకు ప్రసాదంగా పంపిణి చేసారు.